విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని కొండదేవుపల్లి గ్రామానికి చెందిన రైతు రాగోలు కృష్ణ (55) విద్యుదా ఘాతంతో మృతి చెందాడు. పొలంలో వరి పంటను చూసేందుకు మంగళవారం ఐరన్ కస్తా బొరిగి భుజంపై పెట్టుకుని వెళ్తుండగా పొలంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడడంతో ఆ బొరిగికి వైర్లు తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో భార్య లక్ష్మి, పిల్లలు, కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

పొలంలో మృతి చెందిన రైతు

- నాలుగు మద్యం దుకాణాలు పెంపు
- మన్యం జిల్లాలో 52కు చేరిన దుకాణాలు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 11న ఆనందగజపతి ఆడిటోరియంలో లాటరీ
- లైసెన్స్ పరిమితి 2026 సెప్టెంబర్ 30వరకే
- తొలిరోజు దరఖాస్తులు నిల్

153 మద్యం షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ మద్యం షాపులు రద్దయ్యాయి. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు, పెంపు, ధరలు, దరఖాస్తుల స్వీకరణ, లైసెన్సు ఫీజులు తదితర అంశాలపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీని ప్రకారం విజయనగరం జిల్లాలో నాలుగు దుకాణాలు పెరిగాయి. దీంతో, ఇప్పటి వరకు 149గా ఉన్న మద్యం దుకాణాల సంఖ్య 153కు చేరింది. మన్యం జిల్లాలో కొత్త, పాత కలుపుకుని 52 ఏర్పాటు కానున్నాయి. వీటికి సంబంధించి రెండు జిల్లాల్లోనూ ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. విజయనగరం జిల్లాలో 10, పార్వతీపురం మన్యం జిల్లాలో 5చొప్పున ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లా పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరుగా గానీ, ఆన్‌లైన్ పద్ధతిలోగానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ కూడా ఆ సమయం వరకు అందుబాటులో ఉంటుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు స్పష్టం చేశారు. ఒక దుకాణానికి ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. అలాగే ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ నమోదు చేయాల్సి వుంటుంది. దరఖాస్తుతో పాటు రూ.2లక్షల విలువ గల డిడి లేదా చెక్కును జతపర్చాలి.నాలుగు కేటగిరీల్లో దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. జనాభా ప్రాతిపదికన వీటిని విభజించినట్టు డిసి బాబ్జీరావు తెలిపారు. కేటగిరిని బట్టి లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి వుంటుంది. నిర్దేశించిన దుకాణం పరిధిలో 10వేల లోపు జనాభా ఉంటే లైసెన్సు ఫీజు రూ.50లక్షలు చెల్లించాల్సివుంటుంది. 10వేల నుంచి 50వేల లోపు జనాభా అయితే రూ.55లక్షలు, 50వేల నుంచి 5లక్షల లోపు జనాభా గలిగిన దుకాణానికి రూ.65లక్షలు, 5లక్షల జనాభా పైబడిన దుకాణాలకు రూ.85లక్షల చొప్పున ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు చెల్లించాల్సివుంటుంది. ఈ సొమ్మును మొత్తం ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. ఒక ఏడాది తరువాత 10శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లైసెన్సుకు రెండేళ్ల కాలపరిమితి కూడా ప్రభుత్వం విధించింది. 2026 సెప్టెంబర్ 30తో ముగియనుంది. కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలు ఆ నగరానికి 5కిలో మీటర్లలోపు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. మున్సిపాల్టీ పరిధికి 2కిలో మీటర్లలోపు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. గ్రామాల్లో అయితే, ఆ దుకాణం పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు.

బడి, గుడికి దూరంగా ఉండాలి : డిసి బాబ్జీరావు

మద్యం దుకాణాలను బడి, గుడి, చర్చి, మసీద్ తదితర ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు కనీసం 100 మీటర్ల దూరంలో ఉండాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గెజిట్‌లో పేర్కొన్న అంశాలను వివరించారు. 30పడకల ఆసుపత్రులకు కూడా 100 మీటర్ల దూరం పాటించాలని స్పష్టం చేశారు. మండల, మున్సిపల్, కార్పొరేషన్‌లలో జనాభా ప్రతిపదికన దుకాణాల కేటగిరీలు, ఫీజులు ఉన్నాయని వివరించారు. గీత కార్మికులకు 10శాతం దుకాణాలు రిజర్వు విషయమై ప్రజాశక్తి ప్రశ్నించగా వారికి అదనంగా దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా త్వరలోనే ప్రభుత్వం నుంచి వస్తాయని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువకులు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయొద్దు

ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కు అని, కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయొద్దని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాపాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కెఎల్‌పురం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు జీవనాడి అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రప్రభుత్వం దశల వారీ నష్టాల్లోకి నెడుతూ , గనులు కేటాయించకుండా, ఉత్పత్తి జరగనీయకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని అన్నారు. నష్టాల్లో ఉందనే కారణంతో విశాఖ ఉక్కును పోక్షావ కంపెనీకి అమ్మడానికి చూడడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల తలసరి ఆదాయం విశాఖ ఉక్కు మీద ఆధారపడి ఉందని, కొన్ని వేల మంది అక్కడ ఉద్యోగం చేయడం ద్వారా మరికొన్ని లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఇటువంటి ఉపాధి సంజీవిని అయిన విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందని తెలిపారు. విద్యార్థులంగా రేపటి మా భవిష్యత్తు కోసం విశాఖ ఉక్కు కోసం ప్రాణాలైనా ఫణంగా పెట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఒక పక్క స్టీల్ ప్లాంట్ అమ్ముతానని చెప్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకుండా ప్రజలను తిరుపతి లడ్డూ పేరుతో దారి మళ్లించి విశాఖ ఉక్కును అమ్మేయడానికి పరోక్షంగా సహకరిస్తుందని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరినే ఖండించాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును కాపాడాలని , దానిని సెయిల్ లో విలీనం చేసి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిరసన అనంతరం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు విద్యార్థులు కలెక్టరేట్ వద్ద మానవహారం నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జె .రవికుమార్, ఎం.వెంకి, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, జగదీష్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి పండగకు పటిష్ట చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 13 నుంచి జరిగే విజయ నగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. పండగకు ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఉత్సవాలు, పండగ రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా నిర్వహించే విధంగా భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులతో సంప్రదించి వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగు ప్రాంతాలను, లైటింగు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్లలో ఎటువంటి స్నాచింగ్స్ జరగకుండా బందోబస్తు, క్రైం బృందాలను నియమించాలన్నారు. వృద్ధులు, వికలాంగుల అవసరమైన సేవలందించేందుకు సేవాదళ్ ఏర్పాటు చేయాలన్నారు. సిరిమాను తిరిగే రహదారి లోకి పెద్ద సంఖ్యలో భక్తులు చొరబడకుండా ముఖ్య కూడళ్లలో భారికేడింగు ఏర్పాటు చేయాలన్నారు. సిరిమానోత్సవ పూర్తయ్యే సమయానికి చీకటి పడి, కరెంటు సప్లయి కూడా నిలిచిపోనున్నందున ప్రత్యామ్నా యంగా లైటింగు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీని వాసరావు, ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

అదనపు ఎస్‌పి సౌమ్యలత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా పి.సౌమ్యలత మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎసిబిలో పని చేస్తున్న సౌమ్యలతను విజయనగరం జిల్లా అదనపు ఎస్‌పి (పరిపాలన)గా నియమించింది. ఈమేరకు ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్‌పి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయ పని తీరును పర్యవేక్షించాలని, రాష్ట్ర డిజిపి కార్యాలయం, రేంజ్ పోలీసు కార్యాలయాలతో జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఎటువంటి కాలయాపన లేకుండా జరిగే విధంగా చూడాలని ఎస్‌పి సూచించారు. డైరెక్ట్ డిఎస్‌పిగా పోలీసుశాఖకు ఎంపికైన పి.సౌమ్యలత, గతంలో బొబ్బిలి, ఇంటిలిజెన్సు, ఎసిబిలో సమర్ధవంతంగా పని చేసారు.

ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట/గజపతినగరం

జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తాల పంపిణీ కార్యక్రమం మంగళవారం తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు అన్ని వార్డులు గ్రామాల్లో ముమ్మరంగా సాగింది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆయా మండలాల్లో పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మెంటాడ మండలం ఆంద్ర, లోతుగడ్డ గ్రామాల్లో పింఛను పంపిణీ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మంత్రి ఇంటింటికి వెళ్లి పెన్షన్ దారులకు మొత్తాలను అందజేశారు.

గజపతినగరం మండలం పురిటిపెంట, బొండపల్లి మండలం అంబటి వలస గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు పింఛనుదారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం డిఆర్‌డిఎ కార్యాలయంలో జిల్లాలో పింఛన్లు పంపిణీ జరుగుతున్న తీరును కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ వెంట జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, గజపతినగరం ఎంపిడిఒ కిశోర్‌కుమార్, తహశీల్దార్ రత్నకుమార్ తదితరులు ఉన్నారు. జిల్లాలో అక్టోబర్ నెలలో మొత్తం 2,78,240 మందికి పింఛన్ మొత్తాలు పంపిణీ చేయాల్సి ఉండగా మధ్యాహ్నం రెండు గంటల సమయానికి రెండు లక్షల 70 వేల 130 మందికి పింఛన్ మొత్తాలు అందజేసినట్లు డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. 97.09 శాతం మందికి ఫించన్ మొత్తాల పంపిణీ పూర్తి అయ్యిందన్నారు.

పురిటిపెంటలో పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

సంక్షేమ పాలన అందిస్తున్నాం : ఎమ్మెల్యే

విజయనగరం టౌన్ :టిడిపి హయాంలో సంక్షేమ పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. దాసన్నపేట, నవాబుపేట లోనూ, కెఎల్ పురం మొండవీధిలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, టిడిపి నాయకులు ఐవిపి రాజు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి పాల్గొన్నారు

పైడితల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లమ్మ దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. చదురుగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను పండుగ నేపథ్యంలో భక్తులు ఘటాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి వేకువ జాము నుండి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే

సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు

ఉత్సవ వేదికలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవం తో ముడిపడిన పలు వేదికలను ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ముందుగా పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అయోధ్య మైదానం, సరస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే మాన్సాస్ గ్రౌండ్, క్రీడా పోటీలు నిర్వహించే విజ్జీ స్టేడియంను పరిశీలించారు. కార్యక్రమాలపై అధికారులు, ఎమ్మెల్యేతో చర్చించారు. విజ్జి స్టేడియంలో నిర్మాణం పూర్తయిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను ఈనెల 10వ తేదీలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే

విజయనగర ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు పిలుపునిచ్చారు సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, సాంస్కృతిని చాటి చెప్పేలా, విభిన్నంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పర్యటనలో ఎఎస్‌పి సౌమ్యలత, డిఆర్ఒ ఎస్ డి అనిత, సిపిఒ పి..బాలాజీ, ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఆర్‌డిఒ కీర్తి, పైడితల్లి, ఆలయ ఇఒ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, టిడిపి నాయకులు ఐవిపి రాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి ఓరాజు అన్నారు. మంగళవారం విజ్జీ స్టేడియంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా క్రీడా ప్రాంగణాన్ని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, ప్రజారోగ్య సిబ్బంది, క్రీడాకారులతో కలిపి శుభ్రపరిచారు. ముందుగా హాకీ క్రీడాకారులకు హాకీ స్టిక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ స్ఫూర్తి కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వర్రావు, టిడిపి నాయకులు ఐవిపి రాజు, పిల్లా విజయ్ కుమార్, ప్రసాదుల లక్ష్మీప్రసాద్, కర్రోతు నర్సింగరావు, ఆల్తి బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్ వృద్ధాశ్రమం సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఒతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కళ్యాణి నగరంలోగల నైట్ షెల్టర్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన న్యాయఅవగాహన సదస్సు విజయ కల్యాణి మాట్లాడుతూ వయోవృద్ధులకు సంబంధించిన చట్టాలు, హక్కులను వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు మనకు భారం కాదని, మనకు వారు బలమని అన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ కాలనీ పిహెచ్‌సి వైద్యులు ఎల్.వినోద్‌కుమార్, డాక్టర్ శిరీష, రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు పాల్గొన్నారు.

నివాసమున్న చోటే ఇళ్లు కట్టివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలు నివాసమున్నచోటే పట్టాలిచ్చి ఇళ్లు కట్టి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. నగరంలోని రామకృష్ణా నగర్ శాఖా మహాసభ మంగళవారం జరిగింది ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం శంకర్రావు మాట్లాడుతూ మోడీ పాలనలో దేశంలో రాజ్యాంగం దెబ్బ తింటోందన్నారు. ధరలు పెరిగి పేదల బతుకులు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీ కరణ చేసి అదాని, అంబానీ సేవలో ఉన్న మోడీకి దేశం , ప్రజలు గురించి ఆలోచించే తీరిక లేదని అన్నారు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు నోచుకోలేదని అన్నారు. అందుకే ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. అనంతరం అందరికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని, అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు, స్టాఫ్ తగినంత మందిని నియమించాలని, జిల్లా కేంద్రాస్పత్రిలో హార్ట్, యురాలజీ , న్యూరాలజి, కేన్సర్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు వేయాలనే ప్రతి పాదనను విరమించి కోవాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, శాఖాకార్యదర్శి ఎం.జగదాంబ, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం మహేంద్ర హాస్పిటల్స్ డాక్టర్లు, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రామయ్య పంతులు ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులు, రొమ్ము కాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్రగిరి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ జయశంకర్ కృష్ణ అవగాహన కల్పించారు. మారుమూల ప్రాంతాల్లో సేవలు అందించే గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించడం ద్వారా సరైన సమయంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని నిపుణులైన వైద్యుల దగ్గరికి పంపించి సహాయం అందించగలరని తెలిపారు. పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు పి.రామయ్య మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యం మాత్రమే చేసి నిపుణులైన వైద్యులకు పంపించాలని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మహేంద్రగిరి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ పి.నల్లనయ్య మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, ప్రజా అవసరాలను తీర్చే క్రమాన్ని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సాకేటి వీధిలో కమ్యునీటీ హాల్‌ను, వివిధ ప్రాంతాలలో సిసి రోడ్లు, డ్రైన్లు వంటి నిర్మాణ పనులను పరిశీలించారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో లక్ష్మికి సిల్వర్ మెడల్

విజయనగరం టౌన్ : అండర్ 23 విభాగంలో సెప్టెంబర్ 28 నుంచి 30వరకు జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన జి.లక్ష్మి లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. లక్ష్మిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు,క్రీడాకారులు అభినందించారు.

సిహెచ్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు యూత్ హాస్టల్లో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సిహెచ్‌ఒలకు శిక్షణ ఇచ్చారు. ఆర్‌కెయస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ వివిబి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్‌కెఎస్‌కెలోని ముఖ్యమైన అంశాలు, రిప్రొడక్టివ్ హెల్త్, ఎమోషనల్ వెల్బీయింగ్, పోషకాహారం, హింస నుంచి రక్షణ అంశాలపై వివరించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుంచి విద్య లైజనింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ సఖి ప్రోగ్రాం కింద కిషోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టెలి మెడిసిన్, టెలి కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.వికాస్, పిహెచ్‌సిల సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

కెజిబివిలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్ట్) మరియు బోధనేతర సిబ్బందిని పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం (ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో (apkgbv.apcfss.in) వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ 7075039990, 7075159996 టోల్ ఫ్రీ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో సమగ్ర శిక్ష కార్యాలయములో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో జివిడిఒ 9000204925, సూపరింటెండెంట్ 9494465684, ఎఎస్ఒ 9701360225, ఎజిసిడి 8074551455, అసిస్టెంట్ సిఎంఒ 8985495098 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిఎస్ఎన్ఎల్ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం నగరంలోని టెలిఫోన్ భవన్ నుండి సింహాచలం మేడ, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం, అంబేద్కర్ జంక్షన్ మీదుగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ఆ సంస్థ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్ దేశ ప్రజలకు చౌకైనా నాణ్యమైన సర్వీస్ అందిస్తుందని, బిఎస్ఎన్ఎల్ 4జి, 5జి నెట్ సర్వీసులు త్వరలో ప్రారంభిస్తు ందని నినదించారు. ర్యాలీలో ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి

బొబ్బిలి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో మంత్రిని కలిసి తిరుమల స్వామివారి ప్రసాదాన్ని అందించి బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి రోజురోజుకు రోగులు తాకిడి పెరుగుతున్న మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. బాడంగి ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బేబినాయన చెప్పారు.

విద్యుత్ శాఖామంత్రికి కృతజ్ఞతలు

రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎమ్మెల్యే బేబినాయన కలిసి కృతజ్ఞతలు చెప్పారు. మండలంలోని కొత్తపెంటలో విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మరణించడంతో రైతును ఆదుకుంటామని మంత్రి ప్రకటించడంతో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలో నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని బేబినాయన కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

దేవాదాయ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట: దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణని అమరావతిలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు దేవాలయ ధూప దీప నైవేద్యాల గురించి, నూతన దేవాలయ నిర్మాణం గురించి ప్రతిపాదనలు ఇచ్చారు. సిజీఎఫ్ ద్వారా నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంప జగన్నాథనాయుడు, పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం

విజయనగరం టౌన్: ప్రపంచ వద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీ సాయి కష్ట వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ వృద్ధులలో నిర్వహిస్తున్న వృద్ధుల నిరాశ్రయుల భవనంలో వృద్ధులకు పండ్లు, బిస్కట్లను అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు కుటుంబంలో పాటు సమాజానికి పెద్దదిక్కు అని, ఎంతో అనుభవం కలవారని, వారిని చూసి యువతరమంతా ఎంతో మంచిని గ్రహించాలని అన్నారు. ప్రభుత్వాలు కూడా వృద్ధుల శ్రేయస్సు, హక్కుల కోసం అనేకమైన చట్టాలను రూపొందించాయని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సెహెచ్ అప్పలనాయుడు, క్లబ్ పెద్దలు త్యాడ ప్రసాద్ పట్నాయక్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఆతవ రవికుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించాలే చదువులు ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు మాట్లాడుతూ వృద్ధులను బాగా చూసుకోవాలని అన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు.

ఘనంగా దసరా సంబరాలు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో దసరా సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసరా పాటలను ఆలపిస్తూ బాణాలతో గ్రామ వీధులలో తిరుగుతూ గత స్మృతులను విద్యార్థులకు తెలియజేస్తూ దసరా సాంప్రదాయాలను వివరించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని శ్వేతాచలపతి పాఠశాల రోడ్డు, ఎన్‌టిఆర్ బొమ్మ, తాండ్రపాపరాయ విగ్రహం ప్రాంతాల్లో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలను కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శ్వేతాచలపతి పాఠశాల వద్ద ఎలక్ట్రికల్ బంక్ వద్ద చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ బొమ్మ జంక్షన్లో కాలువలో పూడికలు పేరుకుపోవడంతో తొలగించాలని సూచించారు. అనంతరం పింఛన్లు పంపిణీను పరిశీలించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, ఉన్నారు.

గిరిజన గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలి

శృంగవరపుకోట: గిరిజన తెగలు నివసించే ప్రాంతాలలో అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2న ప్రారంభించనున్న జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ కార్యక్రమంలో ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి లేని గిరిజన గ్రామాలను ఎంపిక చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు జరతా గౌరీస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దబ్బగుంట గిరిజన గ్రామంలో గిరిజనులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌరీష్ మాట్లాడుతూ జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్‌లో భాగంగా మండలంలోని పుణ్యగిరి, కొత్తపాలెం, వేపాడ మండలంలోని గదభవలస గ్రామాలను జిల్లా కలెక్టర్ ఎంపిక చేశారని ఈ గ్రామాలను రెండో ప్రాధాన్యత కింద చేర్చుతూ మొదట ప్రాధాన్యత కింద మండలంలోని అభివృద్ధి లేని గిరి శిఖర దారపర్తి పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలను, వేపాడ మండలంలో మారిక గ్రామంలో నివసిస్తున్న పివిటిజిల గ్రామాలను జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ కింద పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా ఎంపిక చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిని అందజేస్తామని అన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

శృంగవరపుకోట: ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటుచ ఏశారు. కలశాల స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సమన్వయకర్త జి ఈరన్న మాట్లాడుతూ నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉచిత శిక్షణా కల్పించామన్నారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు చేతిలమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కే వాసుదేవరావు, డాక్టర్ వి.సుధీర్, సిహెచ్ శ్రీనివాసరావు, ఎపి ఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ భాస్కర్ రావు, ట్రైనర్స్ సన్యాసరావు, మోహన్ రావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

శృంగవరపుకోట: మండలంలోని చామలాపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయునిగా పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఆశపు శ్రీనివాస్‌కి ఘన సన్మానం చేశారు. లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన పిజిఎస్ సతీష్ కుమార్‌కు కూడా మంగళవారం చామలపల్లి గ్రామ సర్పంచ్ జె సూర్యారావు, ఎస్ ఎమ్ సి చైర్ పర్సన్ జ్యోతి, తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఇరువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వి. రమణ, మండల అధ్యక్షులు ఎంవిఎఎస్ నారాయణ, గౌరవాధ్యక్షులు, విఎస్ దేముడు, పాఠశాల ఉపాధ్యాయులు టి సింహాచలం నాయుడు, పి. గణపతి రావు, కృష్ణ, ఎస్‌కె కబీర్ పాల్గొన్నారు.

హెచ్‌సికి సత్కారం

డెంకాడ: పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా సుమారు 26 సంవత్సరాలు విధి నిర్వహణ చేసి డెంకాడ పోలీస్ స్టేషన్‌లో ఏడాదిన్నరగా పనిచేస్తున్న సుంకరి రామునాయుడుకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చింది. ఈ మేరకు బదిలీపై వెళుతున్న అతన్ని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సమక్షంలో ఘనంగా సత్కరించారు.

'ప్రజల కోసం పవనుడు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సనాతన ధర్మ పరిరక్షణకు ఐక్యంగా కదులుదామని జనసేన నాయకులు గురాన అయ్యలు, అవనాపు విక్రమ్ , మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కాళ్ళ గౌరీశంకర్ పిలుపునిచ్చారు. పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మంగళవారం మన్నార్ శ్రీ రాజగోపాలస్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. 'ప్రజల కోసం పవనుడు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు , అవనాపు విక్రమ్, కాళ్ల గౌరీ శంకర్ మాట్లాడుతూ తిరుపతి కల్తీ లడ్డూపై విచారణచ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు.

గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

జాతిపిత మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు అన్నారు. మంగళవారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గాంధీ వేషధారణలో ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హేరమ్ అంటూ నినాదాలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని వైడిఒ ప్రాజెక్టు మేనేజర్ ఎల్.శ్రీకాంత్ బాబు అన్నారు. స్థానిక రిషి జూనియర్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్, హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనమవుతాయని, దూరంగా ఉండాలని కోరారు. హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వ్యాప్తిస్తుందో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: యువత మాదకద్రవ్యాల అలవాటు వల్ల భవిష్యత్తు బానిసత్వం అవుతుందని సిఐ వి.రమణమూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎన్‌డిపిఎస్ చట్టాల గురించి వీడియోలు, పాంప్లెట్స్, ఫ్లెక్సీల రూపంలో, క్విజ్ రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ కమిటీ, డ్రగ్స్ కంప్లెంట్ బాక్స్‌ను కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గంగరాజు, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంగర: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు ఛిన్నాభిన్నం అవుతాయని వివరించారు. అనంతరం కళాశాలలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. నారాయణ రావు, బంగి పోలినాయుడు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ బి. దేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరివిడి: ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న డిఎస్‌పి రాఘవులు

గరివిడి: స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రకాష్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 'సంకల్పం' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌తో యువత, విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయన్నారు, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాల వేటలో పడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే జైలు జీవితానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. చీపురుపల్లి సిఐ జి.శంకర రావు మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, హష్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం కళాశాలలో సంకల్పం అనే ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.లోకేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఇద్దరు మంత్రులను మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర పౌర విమానయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని బంగార్రాజు తెలిపారు. అనంతరం ఇద్దరు మంత్రులకు శాలువాలు కప్పి పూల మొక్కలను అందజేశారు. ఆయనతోపాటు నాయకులు కర్రోతు రాజు, పిడుగు తోటరావు, మౌళి వర్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ

మండలంలోని పోలిపల్లి, లింగాల వలస, గుడివాడ, రాజాపులోవ పంచాయితీలలో మంగళవారం మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, సర్పంచులు చిల్ల జమున, బుగత లలిత, మాజీ ఎంపిటిసి దాసరి అప్పలస్వామి, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాల అమ్మకం దుర్మార్గం

ప్రజాశక్తి - బొబ్బిలి

చరిత్రాత్మక సిబిఎం బాలికోన్నత పాఠశాల స్థలాన్ని అమ్మివేయడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, రైతు సంఘం సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. సిబిఎం పాఠశాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కరస్పాండెంట్ రత్నకుమార్‌ను, కొనుగోలు చేసిన వైసిపి నేతను అరెస్టు చేసి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్న సిబిఎం పాఠశాల స్థలాన్ని వైసిపి నాయకుడు పేరు మీద స్థల మార్పిడి రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమన్నారు. పట్టణ నడిబొడ్డున రూ. 100కోట్లు విలువ చేసే స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. పాఠశాల కరస్పాండెంట్ బోర్డుకు వ్యవహరించిన నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన వారిపై, చేసేందుకున్న వారిపైన కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించి పాఠశాల గుర్తింపును రెన్యూవల్ చేసి తరగతులు కొనసాగించకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు సునీల్, ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబిఎం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

సిబిఎం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూసేందుకే స్థల మార్పిడి రిజిస్ట్రేషన్ చేసినట్లు కరస్పాండెంట్ రత్నకుమార్ చెప్పారు. సిబిఎం పాఠశాలకు

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

వచ్చిన రత్నకుమార్‌ను వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఎం ఎలిమెంటరీ పాఠశాల అనుకుని ఉన్న స్థలం, సిబిఎం బాలికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న స్థలం ఇప్పటికే అన్యాక్రాంతం అయిందని, మిగిలి ఉన్న స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కోమటిపల్లిలో మూడు ఎకరాల స్థలం, ఒక భవనాన్ని సిబిఎం పాఠశాలకు తీసుకుని పట్టణంలో ఉన్న పాఠశాల స్థలాన్ని మార్పిడి చేసి రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. పాఠశాల పాత భవనంలో కొనసాగించాలంటే కొనసాగిస్తామన్నారు. స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని సిబిసిఎన్‌సి ప్రధాన కార్యాలయంలో నిర్ణయం చేయడంతో రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు.

తైక్వాండోలో బంగారు పతకం

ప్రజాశక్తి - కొత్తవలస

పతకం సాధించిన ప్రకాశ్‌రావు

గత నెల 27, 28, 29 తేదీలలో మలేషియాలో జరిగిన, మలేషియా ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో భారతదేశం తరఫున మలుపర్తి ప్రకాశరావు పోటీలో పాల్గొని దేశానికి బంగారు పతకం సాధించాడు. మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన ప్రకాశ్ రావు ఇండియా తరఫున సీనియర్స్ వెయిట్ కేటగిరి అండర్ 80 కేజీల పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. మొదటి ఫైట్ మలేషియా క్రీడాకారుడితో పోటీపడి విజయం సాధించి ప్రీ కోటర్ ఫైనల్ ఎంట్రీ సాధించి ప్రీ కోటర్ ఫైనల్ లో సింగపూర్ క్రీడాకారుడితో తలపడి విజయం సాధించి, సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్ క్రీడాకారుడితో పోటీపడి విజయం సాధించి డైరెక్ట్‌గా ఫైనల్‌కు చేరుకున్నారు. ఫైనల్‌లో మలేషియా క్రీడాకారుడితో పోటీపడి విజయం సాధించి పసిడి సొంతం చేసుకున్నారు. ఈ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో 640 క్రీడాకారులు ఆల్ కేటగిరీస్‌లో పాల్గొన్నారు. ఈ విజయం పట్ల తన గురువు డాక్టర్ పాండ్రంగి రుక్మాకరరావు, స్పాన్సర్ చేసిన పెద్దలు విశాఖపట్నం 105 అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ గోవర్నర్ దండెం పోలారరావు, తిరుపతి రాజు, ఉషారాణి, విశ్వేశ్వరరావు, డిఎల్‌కె.రావు, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రజాప్రతినిధులు, ఎఫ్.బి.సి.క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఉత్తమ సేవలందించిన పారిశుధ్య కార్మికులకు మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ కె.అప్పలరాజు సన్మానం చేశారు. అనంతరం కమిషనర్ పింఛన్ల పంపిణీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎంవి రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, నగర పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

ఎమ్‌డిఎం నిర్వాహకులపై విచారణ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని శిష్టు సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను వెంటనే తొలగించాలని విద్యార్థుల తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యులు పాఠశాలలో విచారణ చేపట్టారు. వంటకాలు రుచికరంగా లేవని, శుచి, శుభ్రత పాటించక పోవడం వల్ల విద్యార్థులు కడుపునొప్పి, వాంతులు వంటి రుగ్మతలకు గురవుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంపిడిఒ రమామణి, ఎంఇఒ తిరుమల ప్రసాద్ విచారణ చేపట్టారు. కమిటీ ముందు కూడా తల్లి దండ్రులు ఫిర్యాదును నొక్కి వక్కాణించారు. తక్షణమే నిర్వాహకులను తొలగించాలని, లేకపోతే తమ పిల్లలకు టీసీలు ఇచ్చి పంపించాలని డిమాండ్ చేశారు. అధికారులు మాత్రం నిబంధనల మేరకు ముందుగా నిర్వాహకులకు పనితీరు మార్చు కోవాలని హెచ్చరిక నోటీసులు జారీ చేస్తామని అప్పటికీ వారి పనితీరు మారకపోతే డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. అయినప్పటికీ పాఠశాల కమిటీ చైర్మన్ తుట్టా అప్పారావు నేతృత్వంలో తల్లిదండ్రులంతా ఒక్కసారిగా అధికారులపై విరుచుకుపడ్డారు. తమ పిల్లల ఆరోగ్యం చెడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తక్షణమే వారిని విధుల నుంచి తప్పించాలని, 20 రోజుల కిందట తాము ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు మీన మేషాలు లెక్కించి ఇప్పటికి వచ్చారని దుయ్య బట్టారు. వెంటనే నిర్వాహకులను తొలగిస్తారా, టీసీలు ఇచ్చి తమ పిల్లలను పంపిస్తారా అని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని ఎంఇఒ వారిని శాంతింపజేశారు. ఈ విచారణలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, వెంకన్న, మాజీ సర్పంచ్ శిష్టు రవణ, ఉప సర్పంచ్ కర్రోతు అప్పారావు పాల్గొన్నారు. అంతకు ముందు మధ్యాహ్న భోజన పథకం వంటలను ఎంపిడిఒ, ఎంఇఒలు పరిశీలించారు. విద్యార్థులతోను, విద్యార్థుల తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాలకు సెలవు దినాలు కావడంతో ఈ నెల 14 న తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

గిరిజన గ్రామాల్లో మంత్రి సంధ్యారాణి పర్యటన

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ గిరిజన గ్రామాల్లో మంగళవారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ తీరును ఆమె పరిశీలించారు. వృద్ధులు వికలాంగులకు ఆమె పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముందు చూపుతో పింఛన్లను భారీగా పెంచి వృద్ధులకు ఆర్థిక భరోసాను కల్పించారన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఆంద్ర ప్రాజెక్ట్ నిర్వాసితులకు చేపలు పట్టుకునే విధంగా అధికారులతో చర్చిస్తామని ఆమె చెప్పారు.

టిడిపిలో చేరిన సర్పంచ్

ఆంద్ర గ్రామంలో నిర్వహించిన సభలో లోతుగెడ్డ గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ సారా భీమారావు తన అనుచరులు 100 కుటుంబాలతో టిడిపిలో చేరారు. మంత్రి సంధ్యారాణి వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి చేస్తున్న అభివృద్ధి



సర్పంచ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సంధ్యారాణి

కార్యక్రమాలకు ఆకర్శితులమై పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, గొర్ల ముసలి నాయుడు, ఎంపిటిసి అప్పల నరసమ్మ, మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణమూర్తి, పడాల గంగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీకి ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన స్కూలు గేమ్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగేపోటీల్లో అండర్ 14లో ఎం.నిఖిల్, టి.లీలాప్రసాద్, ఎం.మణికంఠ, ఎస్.రామా ంజనేయులు, అండర్ 17లో ఎం.నాగరాజు, ఏ.హేమంత్ కుమార్, ఎం. తరుణ్ తేజ్, వి. గిరీష్ కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం వి.జ్ఞాన శంకర్, పిఇటి పతి వాడ శ్రీను, సిబ్బంది గ్రామ పెద్దలు, యువ తను పాఠశాలలో మంగళవారం అభినందించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థి సత్తా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థ మైచర్ల అరవింద్ వ్యాసరచన పోటీల్లో సత్తా చాటాడు. విజయనగరం ప్రభుత్వ సంస్కృ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన 'వికసిత ఆంధ్రప్రదేశ్ ఏ2047 సాకారానికి యువత వివిధ రంగాల ప్రాముఖ్యత' అనే విషయం పై నిర్వహించిన వ్యాసరచన పోటీలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం, 'వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఏ 2041 సాకారానికి యువత విద్యార్థుల పాత్ర' అనే విషయం పై నిర్వహించిన ఉపన్యాస పోటీలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఎంపికైన అరవింద్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తూడెం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అప్పన్న తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో గత నెల 23వ తేదీన ఎంపికలు జరిగాయన్నారు. ఈ ఎంపికల్లో ఆర్.సాత్విక్, డి.దుర్గాదేవి, యు.లోకేశ్వరి ఎంపికయ్యారని అన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను దివిస్ యాజమాన్యంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యార్థులలో సృజనాత్మకత పెరగాలని మండల విద్యా శాఖాధికారి సిహెచ్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంచేందుకు సైన్స్ సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల స్థాయి విజేతలుగా పెంట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జి.మురళి, బి.శ్యామ్ కుమార్, ఆర్.భాస్కరరావు, పట్టణం నుంచి గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల విద్యార్థులు రమ్య, సుశాంత్ నాయుడు, వి.వర్షిణి, రెసిడెన్షియల్ విభాగం నుంచి గురుకుల పాఠశాల విద్యార్థులు సిహెచ్ శరన్, జి.షణ్ముఖవర్ధన్, సిహెచ్ లిఖిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు జెవివి జిల్లా నాయకులు పి.సత్యంనాయుడు చెప్పారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఎస్.శ్రీనివాస్, ఆనెం శ్రీనివాస్, శివకుమార్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.వల్లి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడంలో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి స్లాగనీయమన్నారు. ఈ పరీక్షల్లో వేపాడ ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, శ్రీ విక్టరీ కాన్వెంట్ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు.

కొత్తవలస: మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతగా ఒపి జిందాల్ భారతి విద్యా మందిర్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎల్. సత్యారావు తెలిపారు. మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్స్, జెవివి సభ్యులు సహకారంతో 8 స్కూల్స్ మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షకి హాజరైనట్లు తెలిపారు. హెచ్‌ఎమ్ సిహెచ్. ఈశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు, వినోద్, కోటేశ్వరరావు, మహేశ్వరీ,రోజా, పద్మ పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు అభినందించారు. కర్రి గౌతమ్ గత విద్యా సంవత్సరంలో 'అటల్ మారదన్' పోటీలో పాల్గొని ఎంపికయ్యాడు. 'స్వర్ణాంధ్రప్రదేశ్ ఏ 2047' జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో గోపికా శ్రీవల్లి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పాఠశాల స్థాయి 'చెకుముకి' పోటీలలో 300 మంది పాల్గొనగా నవ్య, శ్యామ్ సాయి, యశ్వంత్, ప్రథమ స్థానాలలో నిలిచారన్నారు. ప్రతిభ చూపించిన కర్రి గౌతమ్‌కు ఉపాధ్యాయ కార్యదర్శి మురళీధర్ రావు 500 రూపాయలు నగదు పారితోషకాన్ని వేదికపై అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయులు శశి భూషణరావు, దాలినాయుడు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పలు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో విజేతలకు ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి తెర్లాం విద్యార్థి, ద్వితీయ స్థానంలో నందిగాం, పెరుమాలి మోడల్ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు యుటిఎఫ్ తరపున మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ త్రినాధరావు, యుటిఎఫ్ జనరల్ సెక్రటరీ జి శంకర్రావు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్, జన విజ్ఞాన వేదిక సభ్యులు నాగేశ్వరరావు, జి చంద్రమౌళి, పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జెడ్‌పి పాఠశాలలో జానవిజ్ఞాన వేదిక, సమగ్రశిక్ష సౌజన్యంతో పాఠశాల సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలలో నిర్వహించారు. మండలంలో గల అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవ్వగా ఈ పోటీ పరీక్షలలో పాల్తేరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా వీరు జిల్లా స్థాయి పోటీకు అర్హత సాధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు, ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీధర్, రామారావు, రమేష్, హాజరయ్యారు.

డెంకాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మంగళవారం నిర్వహించారు ఈ పోటీలలో మండలంలో అన్ని పాఠశాలలో ఉన్న 8, 9,10 తరగతి విద్యార్థులు సుమారు 30 మంది పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల టీచర్ చెకుముకి నిర్వాహకులు కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలలో మండలంలోని కొట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ టెస్ట్‌లో ఐదు జిల్లా పరిషత్ హై స్కూల్స్, 2 ప్రైవేట్ హై స్కూల్ పాల్గొనగా జిల్లా పరిషత్ కొట్టం హై స్కూల్ ప్రథమ స్థానం, గర్ల్స్ హై స్కూల్ ద్వితీయ స్థానాలు సాధించగా, ప్రైవేటు స్కూళ్లలో త్రినేత్ర స్కూల్ ప్రథమ స్థానం, సర్వేపల్లి ద్వితీయ స్థానం సాధించాయి. వీరంతా ఈ నెల 27న జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారు. ఉపాధ్యాయులు జి వెంకట్రావు, సత్యారావు, పి స్వప్న, శ్రీనివాసరావు, షేక్ రహీం, ప్రసాద్ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. 17/2022

Between:
Pudi Raju Naidu ....Petitioner
And:

NOTICE TO RESPONDENT NO.9 TO RESPONDENT No. 11
Hearing date: 03-10-2024,

9. Mylapalli Chinnatalli w/o Sathibabu dor no 525 YSR Nagar Kondakarakam Road Vizianagaram.
10. Ramesvarapu Laxmi w/o Raju door no 508 YSR Nagar Near Kondakarakam Road Vizianagaram.
11. Munjeti Santhosh, Kondakindam Village Bondapalli Mandal Vizianagaram.

ఇందు మూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా పూడి రాజునాయుడు, S/o రామ్మూర్తి, వైఎస్ఆర్ నగర్, కొండకరకాం రోడ్ దగ్గర, విజయనగరం పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో I.P.No.17/2022 పిటిషన్లు దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల స్వయముగాగాని లేదా వకీలుగారి ద్వారా గాని **తే 03-10-2024దిన ఉదయం గం॥ 10-30 ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెనని, లేని పక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈపత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

G.V.S.V Prasad Rao
Advocate, Sanjeev Nagar Colony
Near Collector Office, VIZIANAGARAM
Mobile No. 9701815290

IN HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S. NO 150/2023

Between:
Taddi Srinivasa Rao ...Plaintiff
And:
Lakkoju Kalibabu ...Defendant

NOTICE

To:
Lakkoju Kalibabu, S/o Venkata Rao, R/o D.No. 3-6-25, Avanapuveedhi, Vizianagaram, Vizianagaram District.

Please take notice that the plaintiff filed the above suit against you for recovery of the amount due under the suit promissory note and the above matter is stands posted to 21/10/2024 for your appearance, and you are to appear on aforesaid date before the Honourable Principal Junior Civil Judge Court, Vizianagaram at about 10-30 A.M. in person or through pleader, otherwise the above matter will decide against you. Hence this notice.

(As per the order of the Honourable Court)

M.TRINADHA RAO
Advocate for Plaintiff,
O/o Sunkaraveedhi,
VIZIANAGARAM.
Cell. 7013083744